క్లుప్తంగా

వరుణుడి కోసం అభిషేకం



బెళుగుప్ప రామేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం రామేశ్వరస్వామి ఆలయంలో వరుణుడి కోసం బెళుగుప్ప రైతులు వేదపండితులతో మహన్యాస పూర్వక ఏకాదశ వార పంచామృత రుద్రాభిషేకం నిర్వహించారు. ఈఏడాది ఖరీఫ్ విత్తనసాగుకు అదునుదాటినా సరైన వర్షాలు లేకపోవడంతో వరుణుడి కోసం పరమశివుడి అనుగ్రహం కోసం రుద్రాభిషేకం చేశారు.

4న చౌడేశ్వరి అమ్మవారి జయంతి

ఉరవకొండ: ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయం ఈనెల 4న జరిగే అమ్మవారి జయంతి ఉత్సవాలకు ముస్తాబు అయింది. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్త శరత్, కార్యదర్శి కొత్తలక్ష్మీదేవి మాట్లాడుతూ జయంతి సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఎర్రిస్వామి తదితరులు

వజ్రకరూరు: ఈనెల 8న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో ఎన్నికలు, మధ్యాహ్న భోజనం అమలు, అకడమిక్ క్యాలెండర్ అమలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుల చేసినట్లు తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 5న మధ్యాహ్నం 1 గంటకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈనెల 8న ఉదయం 8 గంటల నుంచి ఎన్నికలు నిర్వహించనున్నట్లు తలెపారు.

8న పాఠశాలల్లో ఎన్నికలు



శెట్టూరు కేజీబీవీలో నోటిఫికేషన్ షెడ్యూల్‌ను బోర్డుపై అంటిస్తున్న ఎస్‌ఓ లలిత

శెట్టూరు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్న పాఠశాలలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 8న మొత్తం 56 ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఎన్నిలకు సంబంధించిన షెడ్యూల్ పాఠశాల నోటీస్ బోర్డులో శెట్టూరు కేజీబీవీ ఎస్‌ఐ లలిత ఉంచారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రహదారి పక్కన గోతిలో పడిన ఇన్నోవా

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు క్రాస్ సమీపంలో బళ్లారి-కళ్యాణదుర్గం రహదారిపై ఇన్నోవా బోల్తాపడింది. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన మెకానిక్ బాషా తల్లిదండ్రులు మక్కాకు వెళ్తుండడంతో బళ్లారి రైల్వేస్టేషన్‌లో దింపి, తిరిగి కుటుంబ సభ్యులతో ఉద్దేహాళ్‌కు వెళ్తున్నాడు. ఇన్నోవా ఉంతకల్లు క్రాస్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డుపక్కన పడిపోయింది. మెకానిక్ బాషాతో పాటు మరో నలుగురు ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్నారు. అయితే అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం తగదు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మటన్ మార్కెట్‌లో నాణ్యత లేని మాంసం విక్రయాలపై మున్సిపల్ అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ పట్టణ కార్యదర్శి కొ్ౌటేష్, నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, కుమార్, నాగరాజు, తిమ్మప్ప గురువారం మటన్ మార్కెట్‌ను పరిశీలించారు. మాంసం కొనుగోలుదారులతో వారు మాట్లాడగా, మటన్ మార్కెట్‌లో నిబంధనలు పాటించడం లేదని తెలియజేశారు. పశువైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి నాణ్యమైన, ఆరోగ్యకరమైన గొర్రెలు, పొట్టేలు, మేకలు కోసి విక్రయాలు చేసేలా చూడాలన్నారు.

లక్ష్యంపై నిర్లక్ష్యం

- తగ్గిన వ్యవసాయ మార్కెట్ ఆదాయం
- పన్ను వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం
- గత ఐదేళ్లు రికార్డు స్థాయిలో వసూళ్లు
- చెక్‌పోస్టుల్లో జోరుగా జీరో దందా
- 2024-25 కు రూ.1.44 కోట్ల లక్ష్యం
- రూ.16.22 లక్షలు మాత్రమే వసూలు
- గతేడాది జూలై నాటికి రూ.33 లక్షలు వసూలు
- ఆదాయం తగ్గిన యార్డులపై జిల్లా కలెక్టర్ కన్నెర్ర



రాయదుర్గం మార్కెట్ యార్డ్ కార్యాలయం

ఫీజు వసూళ్ల వివరాలిలా..

సంవత్సరం	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూలైన మొత్తం
2018-19	రూ.1.25	రూ.1.05.38 కోట్లు
2019-20	రూ.1.05	రూ.1.02.73 కోట్లు
2020-21	రూ.1.24	రూ.30.16 కోట్లు
2021-22	రూ.రూ.95 లక్షలు	రూ.81.20 లక్షలు
2022-23	రూ.1.15	రూ.1.16 కోట్లు
2023-24	రూ.1.20 కోట్లు	రూ.1.32 కోట్లు
2024-25	రూ.1.44 కోట్లు	రూ.16.22 లక్షలు

రాయదుర్గం: రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం గత ఐదేళ్ల తర్వాత క్షీణించింది. సంపద సృష్టించాల్సిన చెక్‌పోస్టుల్లో జీరో వ్యాపారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. జూలై నెలలో జరిగిన వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలను గతేడాదితో పోలిస్తే ఈ సారి సగానికి సగం ఆదాయం గణనీయంగా తగ్గింది. గతేడాదితో పోల్చి చూస్తే ఈ సారి రాయదుర్గం మార్కెట్ కమిటీ జిల్లాలోనే చివరి వరసలో నిలిచింది. ఇందుకు కారణం సిబ్బంది నిర్లక్ష్యమేనని స్పష్టంగా అర్థమౌతోంది. గడిచిన ఐదేళ్లలో కరోనా సమయం మినహా మిగిలిన సమయాల్లో మంచి వసూళ్లు రాబట్టారు.

జిల్లాలోనే దుర్గం మార్కెట్ చివరి వరసలో...

రాయదుర్గం మార్కెట్ కమిటీ జిల్లాలోనే చివరి వరసలో నిలిచింది. సీజన్‌లో మాత్రమే చింతపండు క్రయ,విక్రయాలు జోరుగా సాగుతాయి. దీని ద్వారా యార్డుకు కేవలం రూ.2 లక్షల ఆదాయం మాత్రమే సమకూరుతుంది. మిగిలిన మొత్తం బయట జరిగే లావాదేవీల్లో ఒక్క శాతం, ప్యాడి (వరి) కైతే 2 శాతం మార్కెట్ ఫీజు వసూలు చేయాల్సి ఉంది. వీటితోనే లక్ష్యాన్ని భర్తీ చేయాల్సి వస్తోంది. ఇందుకు కారణం సిబ్బంది నిర్లక్ష్యమేనని స్పష్టంగా అర్థమౌతోంది.

రూ.1.44 కోట్లు లక్ష్యం..

2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యం రూ.1.44 కోట్లు నిర్దేశించారు. ఇందులో జూన్ నెలాఖరు నాటికి గతేడాదితో పోల్చి చూస్తే రూ.33 లక్షలు వసులు కావాల్సి ఉంది. అయితే కేవలం రూ.16.22 లక్షలు మాత్రమే సమకూరింది. ఈ లెక్కన రూ.16.80 లక్షలు ఆదాయం పడిపోయింది. నిర్దేశించిన లక్ష్యం 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31లోపు భర్తీ చేయాలి. కేవలం ఏడు నెలలు మాత్రమే గడువు మిగిలింది. అయితే 20 శాతం కూడా వసూళ్ల ప్రక్రియ చేపట్టక పోవడం పై విమర్శలు వస్తున్నాయి.

అవినీతికి మారు పేరుగా చెక్‌పోస్టులు

నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, రాయదుర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ చెక్‌పోస్టులు అవినీతికి మారుపేరుగా చెలామణి అవుతున్నాయి. జీరోపై వెళ్తున్న వ్యవసాయ ఉత్పత్తులను చెక్‌పోస్టుల్లో పట్టుకుని ఫీజు వసూళ్లు చేయాల్సి ఉన్నా, అందులో పనిచేసే కొందరు మామూళ్లు దండుకుని వదిలేస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. బయట మిల్లుల నుంచి తరలించే వ్యవసాయ ఉత్పత్తులు జీరోపై వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వేలాది బస్తాల్లో వరి తరలిపోతోంది. ఇక్కడ వ్యాపారులు ధర మాత్రమే చెల్లించి మార్కెట్ ఫీజులకు ఎగనామం పెట్టేస్తున్నారు. దీన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు.

లక్ష్యాన్ని అధిగమిస్తాం



ప్రభుత్వం నిర్దేశించిన రూ.1.44 కోట్ల లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో అధిగమించేలా ప్రణాళికలు చేపట్టాం. ప్రధానంగా మిర్చి పంట ఉత్పత్తి రైతు వద్దే స్టోరేజీ ఉండడంతో వసూళ్ల ప్రక్రియ కాస్త మందగించింది. అయినా వచ్చే ఏడు నెలల్లో లక్ష్యాన్ని చేరుకుంటాం. చెక్‌పోస్టుల్లో ఎక్కడైనా జీరో వ్యాపారం జరిగితే కఠిన చర్యలు చేపడతాం. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తాం. ఆరోపణలేగానీ రాత పూర్వకంగా ఫిర్యాదులు అందలేదు. అయినా పర్యవేక్షణ పెంచుతాం. ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– ఎం.శ్రీనివాసులు, మార్కెట్ కార్యదర్శి, రాయదుర్గం

సజావుగా పింఛన్ల పంపిణీ

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మండల ప్రత్యేకాధికారి, జిల్లా స్పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అధికారి శ్రీషేక్ షఫీ, ఎంపీడీఓ సుబ్బరాజు గురువారం పరిశీలించారు. బెళుగుప్పలోని పలు కాలనీల్లో కొనసాగుతున్న పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీ మాధవరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ ఫయాజ్‌తో సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ సూర్యప్రకాశ్, టీఏలు విజయ్, నాగేంద్ర, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా పింఛన్ అందించండి

బ్రహ్మసముద్రం : లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మండలంలోని ముప్పలకుంటలో ఉదయమే పింఛన్ పంపిణీని ప్రారంభించారు. పిల్లలపల్లి, నాగిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం నాగిరెడ్డిపల్లి సమీపంలో ఉపాధి పథకం కింద ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఉపాధి ఏపీఓ అవినాష్ పాల్గొన్నారు.

95శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

వజ్రకరూరు: మండల వ్యాప్తంగా ఎన్టీర్ భరోసా పింఛన్లు గురువారం 95శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విజయలలిత, ఈఓఆర్డీ సదాశివ తెలిపారు. మండలంలోని వజ్రకరూరు,కొనకొండ్ల గ్రామాల్లో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని అధికారులు పరిశీలించారు. మొత్తం 7,197 పింఛన్లు ఉండగా, రూ.3.11 కోట్లు మంజూరయినట్లు తెలిపారు.

గుమ్మఘట్ట : మండల వ్యాప్తంగా ఉన్న 15 గ్రామ సచివాలయాల పరిధిలో 6,204 మంది పింఛన్ లబ్ధిదారుల్లో 5,984 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గౌరిదేవి గురువారం తెలిపారు.96.45 శాతం పింఛన్‌లను గ్రామసచివాలయాల సిబ్బంది పంపిణీ చేసినట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఒకటో వార్డులో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వార్డు కౌన్సిలర్ నాగవేణి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిశోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం

కంబదూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సీడీపీఓ వనజాఅక్కమ్మ, వైద్యాధికారులు ఆసియా, ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గూళ్యం,కంబదూరు గ్రామాల్లో వారు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. ముర్రుపాలులో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, తద్వారా బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. తల్లిపాలు రెండేళ్ల వరకు ఇవ్వవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని వైద్యాధికారులు తేజశ్వి, సర్దార్‌వలి ,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం గూళ్యపాళ్యం గ్రామంలో తల్లిపాలవారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఆరోగ్య విస్తరణఅధికారి గురు ప్రసాద్, సూపర్‌వైజర్ నాగశంకర్, సుశీలమ్మ, హెల్త్ఎడ్యుకేటర్ సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణమ్మ, కృష్ణవేణి, ఏఎన్ఎం భ్రమరాంబ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: తల్లిపాలతో చంటి బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గంగవరంలో మూడో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, సీహెచ్ఓ సునిత, హెల్త్ అసిస్టెంట్ అజయ్‌కుమార్,అంగన్‌వాడీ వర్కర్ రామాంజినమ్మ, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రసవించిన తల్లులు వెంటనే చిన్నారులకు తల్లి పాలు పట్టించాలి, అదే విధంగా ముందస్తుగా గర్భిణులకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ మహేష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కంబదూరు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ వనజాఅక్కమ్మ

కౌకుంట్ల, ఆమిద్యాలలో..

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీ పరిధిలోని ఆమిద్యాల, కౌకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని నింబగల్లు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఆమిద్యాల గ్రామంలో వైద్యాధికారిణి పావని, నింబగల్లు గ్రామంలో కౌకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి అనికేత్ విడుదల చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్‌లు షఫీ, వెంకటరమణ, సీహెచ్‌ఓలు నాగరంగయ్య, భవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాబియా, నాగరత్న పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీలక్ష్మి, గీతాభార్గవి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో సందర్భంగా ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, లింగదహాళ్ గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సీహెచ్‌ఓ నాగమణి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమణ, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



శ్రీధరగట్టలో తల్లిపాలవారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కూడేరు: తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కూడేరులోని ఆరోగ్య ఉప కేంద్రంలో తల్లి ప్రాముఖ్యతపై గర్భిణులు, చంటి బిడ్డ తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డబ్బా పాలతో డబ్బు వృథా అవుతుంద తప్ప, బిడ్డకు ఎలాంటి ప్ర యోజనం ఉండదన్నారు. అనంతరం పోస్టర్లను వి డుదల చేశారు. సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పా ల్గొన్నా రు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

గుమ్మఘట్ట: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ తెలిపారు. మండలంలోని నేత్రపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, భాగ్యమ్మ, మెహరూన్, ఏఎన్ఎం మంజుల, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కళ్యాణదుర్గం రూరల్: హాస్టల్‌లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

కనులపండువగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రికి శేజ్‌హారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కందూరీలు చేశారు.

వర్షాభావంతో ఎండిపోతున్న పంటలు



బండమీదపల్లి వద్ద ఎండిపోయిన చీనీ పంట

కుందుర్పి: తీవ్ర వర్షాభావంతోతో ఖరీఫ్ పంటలతో పాటు ఉద్యాన పంటలు నీరులేక ఎండుముఖం పట్టాయి. భూగర్భజలాలు అడుగండడంతో బోరుబావుల్లో నీటి మట్టం పూర్తిగా తగ్గిందని రైతులు చెప్తున్నారు. మండలంలోని బండమీదపల్లి, జంబుగుంపల, కదరంపల్లి, ఎర్రగుంట, తూముకుంట తదితర గ్రామాల్లో పండ్లతోటలు, వక్క, తమలపాకుల తోటలు ఎండిపోతున్నట్లు బాధిత రైతులు మంజునాథ్, రాజప్ప, ఈరన్న, శ్రీనివాసులు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో మెట్టభూముల్లో వేరుశనగ, ఇతర పంటలు ఎండుముఖం పట్టాయి. వారం రోజులు వర్షాలు కురవకపోతే ఖరీఫ్ పంటలు 90శాతం దెబ్బతినే పరిస్థితి ఉందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ సంబరాలు



ఉరవకొండలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ స్వీట్లు తినిపించుకుంటున్న దృశ్యం



కూడేరులో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు



వజ్రకరూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉరవకొండ: ఉరవకొండలో ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు అధ్వర్యంలో దళిత సంఘం నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి, అనంతరం బాణాసంచా పేల్చారు. అనంతరం 30 ఏళ్ల పాటు ఎమ్మార్పీఎస్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తూ వర్గీకరణ కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి, జైలుకు సైతం వెళ్లి వచ్చిన రాజును దళిత సంఘం నేతలు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేతలు భానుప్రకాష్, కౌకుంట్ల రవి, చెన్నకేశవులు, గంగాధర్, రామాంజనేయులు, రాంపురం చెన్నప్ప, సురేష్, మోపిడి విజయ్, ఓబన్న, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: వజ్రకరూరులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బెంజిమెన్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలోసర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా నాయకుడు గుడిసి రవీంద్ర, మాజీ మండల అధ్యక్షుడు సుకుమార్, జేవీవీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, నాయకులు అశోక్, మతంచంద్ర, దండోరా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంతీర్పు హర్షణీయం

కూడేరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు సమర్థనీయమని తీర్పు చెప్పడం హర్షణీయమని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ చేస్తేనే ఎస్సీల్లో వెనుకబడిన కులాలకు న్యాయం జరుగుతుందని, మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల క్రితం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి పోరాటం కొనసాగిస్తూ వచ్చారన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఈశ్వయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

కంబదూరు: ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చారిత్రాత్మక తీర్పు ఇవ్వడం హర్షణీయమని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమంలో తాను కూడా భాగస్వామ్యుడై, అనేక కేసుల్లో ఉన్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఎలాంటి నిర్ణయం తీసుకొనిందో...ఇక్కడ కూడా కూటమి ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ విషయంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా వర్గీకరణ ప్రక్రియ ఉండే విధంగా చంద్రబాబు చొరవ తీసుకోవాలన్నారు. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి..

ఉరవకొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బసవరాజు గురువారం ఓ ప్రకటనలో కోరారు.

సుప్రీంకోర్టు తీర్పు ఆనందదాయకం

కుందుర్పి: ఎస్సీ వర్గీవకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఆనంద దాయకమని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, దళిత నాయకులు నరసింహమూర్తి, వెంకటేష్ తదితరులు తెలిపారు. గురువారం వారు కుందుర్పిలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

కళ్యాణదుర్గం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించడం హర్షణీయం అని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్ అన్నారు. కళ్యాణదుర్గంలోని సప్తగిరి లాడ్జిలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కేరామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి...అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్రేగౌడ్‌ను పరామర్శిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ఎళ్లవేళలా అండగా ఉంటామని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని మాల్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్రేగౌడ్ ఇంట్లో దుండగులు చొరబడి అతనితోపాటు కుటుంబ సభ్యులపై దాడి చేసిన విషయం విదితమే. మెట్టు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చారు. అక్కడికొచ్చిన ప్రతి ఒక్కరినీ మెట్టు పలుకరించారు.

ఇళ్లలోకి చొరబడి దాడి చేయడం హేయం..

రాయదుర్గం నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరుగా ఉందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అందరూ కలసిమెలసి ఉండాలన్నారు. ఇలాంటి మంచి వాతావరణంలో కొందరు దుండగులు మద్రేగౌడ్ ఇంట్లో చొరబడి దాడులకు తెగబడడం హేయమైన చర్య అన్నారు. అర్ధరాత్రి పూట వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంట్లో చొరబడి భయోత్పాత వాతావరణాన్ని సృష్టించారన్నారు. ఈ విధమైన దాడులతో శాంతిభద్రతలు అదుపుతప్పి ప్రజలు ప్రశాంత జీవితాన్ని గడపలేని పరిస్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మెట్టు

దుండగులపై చర్యలు తీసుకోండి

మద్రేగౌడ్, అతని కుటుంబ సభ్యులపై దాడి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కణేకల్లు ఎస్ఐ శ్రీనివాసులును మెట్టు గోవిందరెడ్డి కోరారు. ఎస్ఐకు మెట్టు ఫోన్ చేసి దుండగులను గుర్తించారా? అని ఆరాతీశారు. కణేకల్లు, మాల్యం తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి, దుండగులను గుర్తించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, పట్టణ కన్వీనర్ టీ కేశవరెడ్డి, రాయదుర్గం మార్కెట్‌యార్డు మాజీచైర్ పర్సన్ ఉషారాణి, యర్రగుంట మాజీ సర్పంచు పాటిల్ చెన్నకేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, వై.చంద్రమోహన్‌రెడ్డి, మాల్యం మాజీ సర్పంచు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు తిప్పారెడ్డి, కళేకుర్తి సర్పంచు భాస్కర్‌రెడ్డి, సుధాకర్, చంద్ర, ఆదినద్దుగురు చంద్రశేఖర్‌రెడ్డి, హళ్లినాగరాజు, యండ్రకాయల వన్నూరప్ప, వేమన, సొల్లాపురం భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.